ప్రకాశం జిల్లాలో ఇనుప గనులు విశాఖ ఉక్కుకు ఇవ్వాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లాలోని ఇనుప ఖనిజం గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలు దగ్గరలో కొణిజేడు, మర్లపాడు, యంపర్ల గ్రామాల్లో సుమారుగా 75 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం ఉన్నట్లుగా కుదురుముఖ్, ఐరన్ ఓర్ కంపెనీ (కేంద్ర ప్రభుత్వ సంస్థ) సుమారుగా 25 సంవత్సరాల క్రితమే నివేదిక ఇచ్చిందని తెలిపారు. గత 25 సంవత్సరాల నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజం గనులను విశాఖస్టీల్‌ప్లాంట్‌కు అప్పగించాలని దరఖాస్తు చేస్తోందని తెలిపారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వం ఈ గనులను జింపెక్స్ అనే ప్రైవేట్ కంపెనీకి 10 ఏళ్ల క్రితం కేటాయించిందని, ఆ కంపెనీ ఒక్క టన్ను కూడా ఇనుప ఖనిజం తీయలేదని పేర్కొన్నారు. ఇటీవల టిడిపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ గనులను జిందాల్ స్టీల్‌కు కేటాయిస్తూ ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, ఇవే గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వెంటనే కేటాయించాలని డిమాండు చేశారు. జిందాల్ స్టీల్ కంపెనీతో చేసిన ఒప్పందం రాష్ట్ర ప్రయోజనాలకు పూర్తి వ్యతిరేకమని తెలిపారు. ప్రకాశం జిల్లాల్లోని గనుల్లో 11 శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి వాటా ఉంచుకుని 89 శాతం వాటాలు కలిగిన జిందాల్ స్టీల్ వేలకోట్ల లాభాలు ఆర్జిస్తోందని వివరించారు. ఇనుప ఖనిజం ధర మార్కెట్‌లో టన్ను ఆరు వేల నుండి ఎనిమిది వేల వరకూ ధర పలుకుతోందని

పేర్కొన్నారు. ఇంతటి విలువైన ఖనిజ సంపదను ప్రైవేట్ కెంపెనీలపరం చేయడం జాతి వ్యతిరేక చర్యని వివరించారు. ప్రపంచీకరణ విధానాలను రాజకీయ నాయకుల సంపద పెంచుకోడానికి వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రైవేట్ కంపెనీల వద్ద కమీషన్ కోసం కక్కుర్తి పడి రాష్ట్రంలో ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు సమకూర్చడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 40 సంవత్సరాల నుండి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు సమకూర్చలేదని పేర్కొన్నారు. దీని వల్ల ప్రతి సంవత్సరం స్టీల్‌ప్లాంట్ సుమారు రెండు వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే లక్ష్యంతో సొంత గనులు కేటాయించడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఇనుప ఖనిజం గనులను కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వివిధ రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయని వివరించారు. అయినా ప్రైవేట్ కంపెనీల నుంచి కమీషన్ కోసం జిందాల్ స్టీల్‌కు ప్రకాశం జిల్లాలో ఇనుప గనులను కేటాయించడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా జిందాల్ స్టీల్ ఒప్పందాన్ని రద్దు చేసి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రకాశం జిల్లాలో గనులను కేటాయించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

కమ్యూనిస్టులపై పవన్ అపరిపక్వ వ్యాఖ్యలు

- వి. శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కమ్యూనిస్టులపై పవన్ కల్యాణ్ చేసిన వాఖ్యలు అపరిపక్వమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. గురువారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం ప్రస్తావించారు. కమ్యూనిజానికి కాలం చెల్లిందన్న పనికిరాని పాత చింతకాయ పచ్చడినే పవన్ కల్యాణ్ మరోమారు వండి వార్చారని పేర్కొన్నారు.ఇది ఆయన అపరిపక్వత, రాజకీయ అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని తెలిపారు. ప్రపంచ పరిణామాలు ఏదిశగా నడుస్తున్నాయో కూడా వారికి అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. తమిళనాడులో సినీ నటుడు విజయ్ గెలుపు తర్వాత పవన్ కల్యాణ్‌పై ఒత్తిడి తీవ్రంగా ఉండడంతో ఆయన నిస్పృహనకు లోనవుతున్నారన్నారని, దీనివల్ల ఆయన ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. మొన్నటి వరకు చేగువేరా, భగత్‌సింగ్ ఆదర్శాల గురించి చెప్పిన ఆయన నేడు కమ్యూనిజమే కాలం చెల్లిందంటున్నారని చెప్పారు. కమ్యూనిజంపై ట్రంప్‌తో సహా అనేకమంది చేస్తున్న దాడి దాని బలాన్ని సూచిస్తున్నదని అన్నారు. గతంలో కమ్యూనిస్టులతో పనిచేసిన పవన్ కల్యాణ్ ఆ తర్వాత బిజెపి సరసన చేరి సనాతన ధర్మం గురించి చాలా హడావుడి చేశారని, ఆంధ్ర ప్రజల్లో ప్రాంతీయ అభిమానం కూడా లేదని ఇప్పుడు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఇలా రోజుకోమాట, పూటకో విధానాన్ని మార్చే ఆయన కమ్యూనిజం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయాలను వ్యాపారంగా భావించే రాజకీయ పార్టీలకు, సమ సమాజంకోసం త్యాగాలు చేసి పోరాడే కమ్యూనిస్టులకు నఖశిఖపర్యంతమంత తేడా ఉందని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉందని, ప్రపంచమంతా పోరాటాలు ఉధృతమవుతున్నాయని మనదేశంలో కూడా యువత తీవ్ర అసంతృప్తితో ఉందని ఇటీవలే వ్యక్తమైందని చెప్పారు. కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో జరుగుతున్న వ్యంగాత్మక క్యాంపెయిన్ దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. అమెరికాతో సహా పక్కనున్న శ్రీలంక వరకు జరుగుతున్న పరిణామాలు ఏమిటో పవన్ కల్యాణ్ లాంటి వారికి కనిపించకపోయినా యువతరానికి స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. మతతత్వ బిజెపితోచేరి యువతలో వస్తున్న మార్పుల్ని ఆయన గుర్తించడంలేదన్నారు. ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ నాగేశ్వర్‌తో ఆరంభమైన వివాదం ప్రజాతంత్ర హక్కుల పరిధిలోనిదని, దాన్ని కొందరు పక్కదారి పట్టించి వివాదంగా మార్చారని, రెండు రాష్ట్రాల ప్రజలు ఇలాంటి వారి ఉచ్చులో పడకుండా తెలుగు ప్రజల ఐక్యతను కాపాడాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు , ప్రక్కన వై. వెంకటేశ్వరరావు

భాగస్వాములుగా మా రాష్ట్రానికి రండి

- భారత అభివృద్ధి యాత్రలో కీలకదశల వద్ద తోడుగా రష్యా
- పర్యటనలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెట్టుబడిదారులుగా కాకుండా భాగస్వాములుగా తమ రాష్ట్రానికి రావాలని రష్యాలోని పారిశ్రామికవేత్తలను విద్య,ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. రష్యా పర్యటనలో భాగంగా సెయింట్ పీటర్స్ బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరం వేదికగా జరిగిన రష్యా-ఇండియా బిజినెస్ ఫోరం సదస్సులో లోకేష్ మాట్లాడారు. భారతదేశ అభివృద్ధి యాత్రలో కీలక దశల వద్ద రష్యా భారత్ కు తోడుగా నిలిచిందన్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్, కూడంకుళం అణువిద్యుత్ కేంద్రం, గగన్యాన్, బ్రహ్మోస్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో రష్యా భారతదేశానికి అండగా నిలచిందని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక కేంద్రాల్లో తమ రాష్ట్రం ఒకటని తెలిపారు. రాష్ట్రంలో రుసాల్ సంస్థ 1.5 మిలియన్ టన్నుల పయనీర్ అల్యూమినియం ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భాగం కావాలనుకునే రోస్కోస్మోస్ టెక్నాలజీ భాగస్వాములకు, ప్రొపల్షన్ కంపెనీలకు, శాటిలైట్ ఇంటిగ్రేటర్లకు, స్పేస్-టెక్ సంస్థలకు ఆంధ్రప్రదేశ్ సహజసిద్ధమైన గమ్యస్థానమని తెలిపారు. అంతకుముందు శ్రీసిటీలో రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లు ఏర్పాటు చేయాలని నోవోస్టల్- ఎం చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోను కలిసి లోకేష్ కోరారు. అలాగే ఎలక్ట్రిక్ రివర్ మెట్రో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలని సిస్టమా ప్రెసిడెంట్ తాగిర్ సిట్ దేకోవ్‌ను కోరారు. మాస్కో తరహా ఎఐ-ఆధారిత ట్రాన్సిట్ ట్రాకింగ్, స్మార్ట్ ట్రాఫిక్ నిర్వహణ సాఫ్ట్ వేర్‌ను అమలు చేసేందుకు సహకారం అందించాలని ఆ దేశ రవాణా మంత్రి, వైస్ మేయర్ మాక్సిమ్ లిక్సుటోవ్‌ను కోరారు.

జనంలోకి వెళ్ళండి...

- చేసిన పనులు చెప్పండి
- మంత్రులకు సిఎం దిశా నిర్దేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

'రెండేళ్లు గడిచిపోయాయి... ఇక జనంలోకి వెళ్ళండి' అని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం అనంతరం ఆయన మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైనారు. చేసిన పనులు ప్రజలకు చెప్పడంలో చాలామంది మంత్రులు విఫలమయ్యారని. ఇకనైనా ప్రజల వద్దకు వెళ్లి ఏం చేశామో చెప్పాలని ఆయన అన్నారు. తమ తమ శాఖల్లో చేపట్టిన కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ నెల 28వ తేదిలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై అనునిత్యం బురద చల్లేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత మంత్రులదేనని చంద్రబాబు చెప్పారు. తాము 16 వేల టీచర్ పోస్ట్ లు భర్తీ చేస్తే, దానిని కూడా తప్పుగా ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారని, గట్టిగా తిప్పికొట్టడంతో తోక ముడిచారని అన్నారు. రెండు రోజుల క్రితం రాజధాని రైతులు కొంతమందిని రప్పించుకుని మీటింగ్ పెట్టారని ఇందులో పాల్గొన్న అశోక్

అనే రైతు నేలపాడులో తన భూమిని ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చారని ఈ సందర్భంగా మంత్రి నారాయణ చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. అటువంటి రైతులను కూడా గందరగోళంలోకి నెట్టాలని జగన్ ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు అన్నారు. ప్రజలకు వాస్తవాలు వివరిస్తే వాళ్ళు పూర్తిగా అర్థం చేసుకుంటారని చెప్పారు.

పంటమార్పిడిని ప్రోత్సహించాలి

పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, అధికారులు కూడా ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని చంద్రబాబు సూచించారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు మనం పంటలు వేసే విధంగా రైతులను ఆలోచన కలిగించాలన్నారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో మన రైతుల బాగా ముందంజలో ఉన్నారని చెప్పారు. సముద్ర ఉత్పత్తులలో కూడా మనం అగ్రస్థానంలో ఉన్నామన్నారు.

అధికారులపై సీరియస్

కొన్ని అంశాల్లో అధికారుల వ్యవహారశైలిపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రభుత్వం నుంచి పూర్తిగా సహకారం ఇస్తున్నప్పటికీ నిర్లిప్తంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ బాధితులు పరిష్కారం.కోసం కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదని చంద్రబాబు సీరియస్ అయినట్లు సమాచారం. వెంటనే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్ కేసులు వెంటనే పరిష్కరించేందుకు మొత్తం 31 కొత్త పోస్టులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

ఇంటర్‌లో నూతన సిలబస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నూతన సిలబస్ అమలు, విద్యా సంస్కరణలు, విద్యా ప్రమాణాల పెంపుపై ఇంటర్మీడియట్ విద్యామండలి బోర్డు కార్యదర్శి పి. రంజిత్ బాషా కీలక ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలోని ఇంటర్మీడియేట్ బోర్డ్ కార్యలయంలో ఆర్ జె డి, డివిఇఓ, ఆర్ఐఓ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపళ్ళుతో గురువారం ఉన్నత స్థాయి వీడియో సమిక్షా సమావేశంలో నిర్వహించారు.

పౌరసేవల ప్రైవేటీకరణ జిఓలు ఉపసంహరించాలి

- మున్సిపల్ కార్మికుల సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ రంగంలో 14 కీలక విభాగాలను, పౌర సేవలను పి పి పి పద్ధతిలో ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 975, 673 జీవోలను తక్షణమే ఉపసంహరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) డిమాండ్ చేసింది. గురువారం ఉదయం విజయవాడలోని బాలోత్సవ భవన్లో జరిగిన రాష్ట్ర సదస్సులో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంఎల్ సి కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసే దిశగా కాకుండా, కార్పోరేట్ శక్తులకు ఎర్ర తివాచీ పరిచి ప్రభుత్వ రంగాన్ని కారుచౌకగా కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. వీటిలో భాగంగానే మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ప్రధానమంత్రి ఆత్మ నిర్భరత, నీతి అయోగ్ సూచనల మేరకు మన రాష్ట్రంలో మునిసిపల్ రంగంలో 14 కీలక విభాగాలను, పౌర సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ, లాభాలను గ్యారెంటీ చేస్తూ ఆగమేఘాల మీద రాష్ట్ర ప్రభుత్వం జీవోలు జారీ చేసిందని అన్నారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిల్లలకు ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రెండేళ్లుగా ఊరిస్తున్నారు తప్ప సమస్యలు పరిష్కరించింది లేదన్నారు. మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే రు. 48 వేల కోట్లు బడ్జెట్ అవసరమని చెప్తున్న ప్రభుత్వాలు వాటి నుండి వసూలు చేస్తున్న నిధులలో నిబంధనల ప్రకారం కేటాయించాల్సిన 40 శాతం నిధులను కూడా ఇవ్వడం లేదన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు పూర్తి అధికారాలు అప్పగించడం లేదని, గత వైసిపి ప్రభుత్వ హయాంలో పట్టణ, గ్రామీణ

సదుస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్ రావు

ప్రజలపైన చెత్త పన్ను విధించినప్పుడు గుండెలు బాదుకున్న తెలుగుదేశం కూటమి నాయకులు, నేడు చెత్త పన్నుతో సహా అన్ని రకాల పన్నులు వేసి ప్రజల మూల్గులు పేల్చేందుకు సిద్ధమయ్యారని అన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వెంటనే ఉపసంహరించాలని ఆయన కోరారు.

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మునిసిపల్ వాహనాలను మూలన పెట్టి అధికార పార్టీ నాయకుల వాహనాలకు పనులు కల్పిస్తూ లక్షల రూపాయలు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని చెప్పారు. రిటైర్ అయిన, చనిపోయిన లేదా అనారోగ్యం పాలైన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధంగాని పాలకులు అధికార పార్టీ నాయకుల అనుయాయులను దొడ్డిదారిన నియమిస్తూ జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. వీటి వల్ల మున్సిపాలిటీలు ఆర్థికంగా దివాళా తీస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులతో సహా అన్ని కేటగిరీల ఉద్యోగులు, కార్మికులకు జీతాలు పెరగాల్సిన గడువు దాటిపోయి నాలుగేళ్లు కావస్తున్నా పాలకులకు చీమకుట్టినట్టు లేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్క మీద తాటికాయ పడ్డచందంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ ప్రజానీకంపై ముప్పేట దాడి ప్రారంభించాయని చెప్పారు. 2016 లోనే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పునిచ్చిందని, తమ శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం కావాలని మున్సిపల్ కార్మికులు కోరుతున్నారని చెప్పారు.

సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను అమలు చేయాలని ప్రభుత్వాలకు మొర పెట్టుకుంటున్నా పాలకులు మాత్రం ప్రైవేటీకరణ పేరుతో పౌర సేవలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, మున్సిపల్ కార్మికులను మరింత బానిసత్వంలోకి నెట్టి చేతులు దులిపేసుకోవాలని చూస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికులను బానిసలుగా మార్చే ప్రైవేటీకరణ విధానాలను ప్రభుత్వం విడనాడకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు కార్మికులు సంసిద్ధం కావాలని కోరారు. మున్సిపల్ కార్మికులతో పాటు పట్టణ ప్రజానీకాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టే విధానాలను ప్రభుత్వం వెంటనే విడనాడాలని రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. కార్మికులందరి నుండి సంతకాలు సేకరించి జూన్ 22వ తేదీ మున్సిపల్ మంత్రి నారాయణ గారికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సదస్సులోనూ తీర్మానించారు. ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు, ధనాల వెంకటావు, జె.విజయలక్ష్మి, టి.విజయమ్మ, సునీల్, బి.ముత్యాలరావు, ప్రవీణ్, టి,చిన్న, ఎస్‌కె.తిరుమలేష్, ఎస్.రవి తదితరులు మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం కోసం అవసరమైతే రాష్ట్రవ్యాపిత నిరవధిక సమ్మెకు కూడా మున్సిపల్ కార్మికులు సిద్ధం కావాలని కోరారు.



గెలిచేందుకు అనేక హామీలు ఇస్తాం

- మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో గెలిచేందుకు స్థానిక పరిస్థితులను బట్టి కొన్ని హామీలు ఇస్తామని, వాటిన్నింటినీ అమలు చేయడం సాధ్యం కాదని సమాచార, పౌరసంబంధాల శాఖమంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు పార్థసారథి గురువారం సచివాలయంలో వివరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను రెండేళ్లల్లో ఎన్ని అమలు చేశారా? పెండింగ్‌లో ఏమైనా ఉన్నాయా?, పెండింగ్ హామీల గురించి మంత్రివర్గంలో చర్చించారా అని మీడియా ప్రతినిధులు మంత్రిని ప్రశ్నించారు. మ్యానిఫెస్టో అమలు గురించి శాఖల వారీగా ఆయా మంత్రులు వివరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీ కూడా పెండింగ్‌లో ఉందని మీడియా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థి నియోజకవర్గాల్లో పర్యటించే సమయంలో కొన్ని హామీలను అమలు చేస్తామంటేనే ప్రజలు ఓట్లు వేస్తారని స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి చెబుతారని తెలిపారు. దీంతో వాటిని అమలు చేస్తామని ప్రకటిస్తారని చెప్పారు.కొన్ని హామీలను పరిశీలిస్తామని మాత్రమే చెబుతామని, మ్యానిఫెస్టోలో పొందుపరచలేమన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు.

టిడిపికి 3.. జనసేనకు 1

- కూటమిలో రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి
- రెండేళ్ల పాలనపై తిరుపతి, అమరావతి, విశాఖలో సభలు
- చంద్రబాబు, పవన్, మాధవ్ భేటీలో నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం నుంచి ఖాళీ కానున్న రాజ్యసభ సీట్ల పంపకాలు కూటమిలో పూర్తయ్యాయి. టిడిపికి మూడు సీట్లు, జనసేనకు ఒక సీటు చొప్పున కేటాయించాలని కూటమి నేతల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో గురువారం సమావేశమయ్యారు. రాజ్యసభ సీట్ల భర్తీ, సర్, రెండేళ్ల పాలన తదితర అంశాలపై చర్చించారు. ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు టిడిపికి మూడు, జనసేనకు ఒక స్థానం కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎన్.డి.ఎ పక్ష నేతలతో చర్చించిన అనంతరం ఈ విషయాన్ని చంద్రబాబు వెల్లడించారు. త్వరలోనే ఈ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలనపై మూడు ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 9న తిరుపతి, 12న అమరావతి, 15న విశాఖలో బహిరంగ సభలు నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. తిరుపతిలో సంక్షేమం, అమరావతిలో సుపరిపాలన, విశాఖలో అభివృద్ధి అంశాలపై కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

ఐదేళ్లల్లో మూడు సీట్లు మాకే : జనసేన

2024-29 మధ్యకాలంలో మూడు రాజ్యసభ సీట్లు తమకు ఇచ్చేలా ముందే చర్చించామని జనసేన పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సర్దుబాటులో భాగంగా తాము లోక్‌సభ స్థానాలను త్యాగం చేశామని ప్రకటించింది.లోక్‌సభ స్థానాలను త్యాగం చేసిన క్రమంలో రాజ్యసభలో స్థానాలు కల్పించేలా చర్చ జరిగిందని తెలిపింది. 2024-29 మధ్య రాష్ట్రం నుంచి వచ్చే రాజ్యసభ స్థానాల్లో మూడు జనసేనకు కేటాయించేలా నిర్ణయించారని, ఇందులో భాగంగా తొలి రాజ్యసభ స్థానం ఈ దఫా ఎన్నికల్లో దక్కిందని పేర్కొంది.

ఆగస్టు 5 నుంచి టెట్

- నేడు నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆగస్టు 5 నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జరగనుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కానుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈ నెల 5 నుంచి జులై 5వ తేది వరకు ఫీజు చెల్లింపు, అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. http://cse.ap.gov.in/ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. జులై 15 నుంచి ఆన్‌లైన్ మాక్‌టెస్ట్ అందుబాటులో ఉంటుంది. అభ్యర్థులు జులై 25 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఆగస్టు 5 నుంచి 21వ తేదీ వరకు టెట్ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలలో జరగనుంది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASECC - రాజమండ్రి, దానవాయిపేట, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా.

స్వాధీనత ప్రకటన
(చర మరియు స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASECC - రాజమండ్రి, దానవాయిపేట, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్13(2)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీమతి లేటు పట్నాల వరలక్ష్మీ గారి లీగల్ వారసులు : 1. శ్రీ పట్నాల మురళీ కృష్ణ,** తండ్రి : సత్యనారాయణ, డి.నెం.115-17-162, శ్రీరామ్ నగర్, కొంతమూరు పోస్ట్, రాజమండ్రి రూరల్, తూర్పుగోదావరి జిల్లా. **2. శ్రీ పట్నాల సాయిరామ్,** తండ్రి : సత్యనారాయణ, డి.నెం.115-17-162, శ్రీరామ్ నగర్, కొంతమూరు పోస్ట్, రాజమండ్రి రూరల్, తూర్పుగోదావరి జిల్లా. **(హెచ్‌టిఎల్ అకౌంట్ నెం.43565281614)** వారు **తేది.27-03-2026** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.42,43,874/-** (అక్షరాల నలభై రెండు లక్షల నలభై మూడు వేల ఎనిమిది వందల డెబ్బై నాలుగు రూపాయలు మాత్రమే) + వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.30-03-2026న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

ఋణగ్రహీత/ హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూల్సు 8 మరియు 9 ప్రకారము **తేది.30-05-2026